క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ మండల సమావేశంలో ఆదివారం సాయంత్రం మూడుగంటలకు పట్టణంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు వెంపాటి సురేష్ కుమార్ తెలిపారు. మండలంలో ఉన్న ప్రజాప్రతినిధులు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. పార్టీ రానున్న రోజుల్లో తీసుకోబోయే భవిష్యత్ కార్యాచరణపై నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి కాలువల మూసివేత

నిడదవోలు: పశ్చిమ డెల్టా కాలువలకు ఆదివారం నుంచి నీటి విడుదల నిలిపివేస్తున్నట్టు జలవనరుల శాఖ శెట్టిపేట ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. జల వనరుల శాఖ చీఫ్ ఇంజినీరు కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమడెల్టా ప్రధాన కాలువకు ఆదివారం సాయంత్రం 6 గంటలకు నీటి విడుదలను నిలిపివేయనున్నారు. తిరిగి జూన్ ఒకటో తేదీన కాలువలకు నీటి విడుదల చేయనున్నారు. పశ్చిమడెల్టా ప్రధాన కాలువతో పాటు ఉప కాలువలను 33 రోజుల పాటు కట్టివేస్తున్నారు.

ధాన్యాధీశ్వరుడిగా వేంకటేశ్వరస్వామి



అన్నవరప్పాడులో ధాన్యం అలంకరణలో ఉన్న వేంకటేశ్వర స్వామి

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం, శని త్రయోదశి, మాస శివరాత్రి సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను వరికంకులతో ధాన్యాధీశ్వరుడిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున 4 గంటలకే మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయంలోని తులసి కోట వద్ద దీపాలను వెలిగించారు. స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నసమారాధన నిర్వహించినట్టు ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. ఇటీవల నూతనంగా ఆలయంలో ప్రవేశ పెట్టిన నిత్య గోత్ర నామార్చన, శుక్రవారం అభిషేకం గోత్ర నామార్చనకు, స్వామి వారికి పూల అలంకరణ, ప్రసాదం, అన్నదానంకి భక్తుల నుంచి విరాళాలు సేకరించడంతో పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని ఆయన తెలిపారు.

28న బీచ్ కబడ్డీ పోటీల జట్ల ఎంపిక

నల్లజర్ల: రాష్ట్ర స్థాయిలో జరుగనున్న అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ పోటీల జట్ల ఎంపికను ఈనెల 28వ తేదీన తీపర్రులో నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్ తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్త్రీ, పురుష జట్లు ఎంపిక జరుగుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారు పురుషులైతే 85 కిలోలలోపు బరువు ఉండాలి. స్త్రీలైతే 75 కిలోల లోపు ఉండాలన్నారు. ఆరోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మే రెండో తేదీ నుంచి నాలుగో తేదీ వరకూ కాకినాడలో జరుగునున్న అంతర్ జిల్లా స్త్రీ, పురుష బీచ్ కబడ్డీ పోటీలలో పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న వారు మరిన్ని వివరాలకు 94913 33906, 96424 96117ను సంప్రదించాలన్నారు.

పుష్కరాలకు ప్రత్యేక సర్వీసులు

నిడదవోలు: తెలంగాణలో మే 15 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్ సర్వీసులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. మూడు రోజుల సరస్వతీ ధామం పుష్కర యాత్రలో భాగంగా బాసర, ధర్మపురి, కాలేశ్వరం, కొండగట్టు, వరంగల్, రామప్ప ఆలయ ప్రాంతాలను భక్తులకు చూపించి కాళేశ్వరంలో పుష్కర స్నానం అనంతరం తిరిగి నిడదవోలు చేరుకుంటారు. ఈ యాత్రకు టికెట్ ధర రూ.3,000 నిర్ణయించినట్టు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అబద్ధాలు చెప్పడం బాబుకు అలవాటు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ
- గోపాలపురంలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం



హాజరైన మండల నాయకులు కార్యకర్తలు



సమావేశంలోమాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

గోపాలపురం: అధికారం కోసం ఎన్ని అబద్ధాలైనా చెప్పగల సమర్థుడు చంద్రబాబు నాయుడు అని, తప్పుడు హామీలతో గద్దెనెక్కి రాష్ట్ర ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. గోపాలపురం కేఎస్ రెడ్డి ఫంక్షన్ హాలులో పార్టీ మండల నూతన అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అధ్యక్షతన శనివారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబుకు ఒక శాపం ఉందని నిజం మాట్లాడితే తల వెయ్యి ముక్కలవుందనే శాపం ఉందని, అందుకే ఆయన అన్నీ అబద్ధాలే చెబుతున్నారని అన్నారు. ఎన్నికల్లో అమలు కానీ హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను నిలువునా ముంచారన్నారు. గడచిన ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు నమ్మరన్న ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ కాళ్లు పట్టుకుని ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకున్నారన్నారు. 2014లో రాష్ట్రంలో రూ1.42లక్షల కోట్లు అప్పు ఉంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలకే ఒక లక్షా 56వేల కోట్లు అప్పులు చేసిందన్నారు. కేంద్రం నుంచి వచ్చిన నిధులు పక్కదారి పట్టిస్తూ రాష్ట్ర ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం, మిర్చి రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని కూటమి ప్రభుత్వం చేపడతున్న ప్రజా వ్యతిరేక పాలనకు ప్రతి నాయకుడు కార్యకర్త ఎదురుతిరిగాలని ప్రజలకు అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

నారావారి పాలన నరకయాతన : జక్కంపూడి రాజా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ నారావారి పాలన రాష్ట్ర ప్రజలకు నరకయాతనగా ఉందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం అభివృద్ధిపై దృష్టి పెడితే కూటమి ప్రభుత్వం మాత్రం వారి వారి వ్యక్తిగత వ్యక్తులకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్ర ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని జక్కంపూడి హామీ ఇచ్చారు.

ప్రతి పల్లె జగనన్నను గుర్తు చేసుకుంటోంది : మాజీ మంత్రి వనిత

నియోజకవర్గంలోని ఏ గ్రామంలోకి వెళ్లినా గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా పని చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన పథకాలను ప్రజలు గుర్తు చేసుకుంటున్నారని రాష్ట్ర మాజీ హోం, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కన పెట్టి సొంత ప్రయోజనాలకు మక్కువ చూపుతున్న కూటమి ప్రభుత్వంచేపడుతున్న ప్రజావ్యతిరేక పనులను ప్రజలకు వివరించాల్సి అవసరం ఉందన్నారు.

ఈకార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, మాజీ రాష్ట్ర అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ల భాస్కరరావు మండల పార్టీ నాయకులు అనుబంధ కమిటి సభ్యులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న సీఎం చంద్రబాబు



గోళ్ల రాజు

నల్లజర్ల: కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ముకాస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి వల్ల గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షా ఫలితాలు దిగజారాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గోళ్ల రాజు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంతో పోల్చితే ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గిందని ఆరోపించారు. నాడు విద్యా సంస్కరణలతో పాటు అమ్మఒడి వంటి అనేక పథకాలతో జగనన్న అత్యుత్తమ ఫలితాలు రాబట్టారని తెలిపారు. నేడు ఆయా పథకాలన్నీ అటకెక్కించి పేద విద్యార్థులను చదువుకు దూరం చేశారన్నారు. 2024లో మొత్తం 2800 పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తే 2025లో అది1680 పాఠశాలలకు పడిపోయిందన్నారు. గతంతో పోల్చితే 5.5శాతం తక్కువ ఉత్తీర్ణత నమోదైందని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంపై కక్ష, యూపీ పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లు తొలగింపు వంటి అస్తవ్యస్తమైన నిర్ణయాల కారణంగా ఫలితాలు దారుణంగా దెబ్బతిన్నాయన్నారు. మరోవైపు గత ఏడాది సెప్టెంబరు వరకు టీచర్ల సర్దుబాటు చర్యలతోనే విద్యా సంవత్సరంలో విలువైన సమయం అంతా వృథా అయిపోయి ఫలితాలు అడుగంటాయన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వెంకట్రావు

చాగల్లు: వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చాగల్లుకు చెందిన జాలెం వెంకట్రావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. వెంకట్రావు చాగల్లు మండల పార్టీ జనరల్ సెక్రటరీగా పనిచేశారు. పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తానని వెంకట్రావు తెలిపారు.

పుల్లలపాడు మాజీ సర్పంచ్ మృతి



పేరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లజర్ల: పుల్లలపాడు మాజీ సర్పంచ్ తాడిగడప వీరయ్య(82) గురువారం మృతి చెందారు. నల్లజర్ల గ్రామ పంచాయతీ నుంచి విభజన తర్వాత పుల్లలపాడుకు మొట్ట మొదటి సర్పంచ్‌గా ఎంపికై ఏడేళ్ల పాటు సమర్ధవంతమైన సేవలు అందించిన వీరయ్య సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం అన్నారు. వీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయనతోపాటు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు సయ్యద్ మునాఫ్, గ్రామ సర్పంచ్ అల్లూరి సూర్యచంద్రరావు, ఎంపీటీసీ వేగి ప్రతాప్, తాడిగడప శ్రీనివాసరావు, అందుగుల వెంకటేశ్వరావు, చేబ్రోలు బాలాజీ, చిన్నీ నాగూయాదవ్, కనికెళ్ల సువర్ణరాజు, వంగలపూడి ఇజ్రాయిల్ తదితరులున్నారు.

1 నుంచి వేసవి క్రీడా శిక్షణ

నల్లజర్ల: పరీక్షలు అయిపోయాయి. వేసవి సెలవులు ఇచ్చేశారు. ఈ సెలవులు వృథా కాకుండా విద్యార్థులకు నచ్చిన క్రీడలలో తర్ఫీదు ఇచ్చేలా స్పోర్ట్ అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా దూబచర్లలో యోగా గురువు దూబగుంట్ల రాజారావు(పీఈటీ)ఆధ్వర్యంలో చెస్, యోగా, వాలీబాల్ శిక్షణ శిబిరం మే ఒకటో తేదీ నుంచి 31వ తేదీ వరకూ జరుగుతుందని రాజారావు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రీడలలో తర్ఫీదు పొందాలని కోరారు.

యువతి అదృశ్యం

చాగల్లు: యువతి అదృశ్యంపై తల్లిదండ్రులు ఇచ్చి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. నెలటూరు గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందని, ఆచూకీ కోసం ప్రయత్నించినప్పటికీ లభించకపోవడంతో తల్లి శనివారం ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి



కొవ్వూరు పురపాలక సంఘం సమావేశానికి హాజరైన సభ్యులు

- మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: ఈ వేసవిలో పురపాలక సంఘంలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అధికారులను ఆదేశించారు. చైర్ పర్సన్ అధ్యక్షతన శనివారం పురపాలక సంఘం సాధారణ సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలో ఉన్న నాలుగు జగనన్న హౌసింగ్ లే అవుట్లకి తాగునీటి సమస్య లేకుండా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. హెడ్ వాటర్ వర్క్స్‌లో మోటారు మరమ్మతులకు నిధులు కేటాయించారు.రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవుట్ పాల్ డ్రైన్లు శుభ్రం చేయడానికి సాధారణ నిధులు నుంచి చెల్లించేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 18వ వార్డులో యనాద కాలనీలో సాముహిక మరుగుదోడ్లు మరమ్మతులకు రూ.4లక్షలు నిధులు కేటాయించారు. క్రిస్టియన్ పేట, ఎన్‌జీవో హోమ్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వద్ద బయో మెడికల్ వేస్ట్ పిట్స్ ఏర్పాటుకి కౌన్సిల్ తీర్మానం చేశారు. మున్సిపాలిటీలో రెండో వార్డులో బీసీ హాస్టల్ వెనుక ఉన్న ఖాళీ స్థలం లెవింగ్ చేయించి పార్కుగా మార్చే ప్రతి పాదనను సమావేశంలో వాయిదా వేశారు. ఆరో వార్డులో సిమెంటు రోడ్డు, డ్రైన్‌ల నిర్మాణానికి, 16వ వార్డులో డ్రైన్ల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. డంపింగ్ యార్డు చుట్టూ ప్రహరీ నిర్మాణానికి, కార్యాలయానికి కొత్త జిరాక్స్ మిషన్ కొనుగోలుకి రూ.2లక్షలు నిధులు కేటాయించారు. సత్యవతి నగర్‌లో మునిసిపల్ కాంప్లెక్స్‌లో బోరు, మోటారు ఏర్పాటుకి, వేములూరు లేఅవుట్లలోను, బ్రిడ్జిపేటలో మోటారులు, పైప్‌లైన్ ఏర్పాటుకి కౌన్సిల్ తీర్మానం చేశారు. బాపూజీ మార్కెట్‌లో మున్సిపల్ కాంప్లెక్స్‌లో ఉన్న దుకాణాల అద్దె పెంపు విషయం సమావేశంలో వాయి వేశారు. ఆస్తి పన్ను వసూలు లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించినందుకు రెవెన్యూ విభాగం సచివాలయం అడ్మిన్స్‌ను, ఇతర సిబ్బందిని, ఆర్ఐ, కమిషనర్, మేనేజర్‌లను చైర్ పర్సన్ రత్నకుమారి, టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని, వైఎస్సార్ సీపీ నేత కోడూరి శివరామకృష్ణ, ఇతర కౌన్సిలర్లను సత్కరించారు. పహాల్గాంలో మృతులకు నివాళులు అర్పిస్తూ కౌన్సిల్‌లో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

జిల్లా అధ్యక్షుడిని కలిసిన పార్టీ నేతలు



వేణును సత్కరిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు వెంపాటి సురేష్‌కుమార్

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నూతన మండల పార్టీ అధ్యక్షుడు వెంపాటి సురేష్‌కుమార్ శనివారం రాజమహేంద్రవరం వెళ్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. తనపై ఎంతో నమ్మకంతో తనకు అప్పగించిన పార్టీ మండల బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తానని సురేష్‌కుమార్ హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలు మరింత సమర్ధవంతంగా నడిపించాలని ఆయన సూచించినట్టు సురేష్ తెలిపారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొలిశెట్టికి సత్కారం



రావూరుపాడులో కొలిశెట్టి నాగేశ్వరరావును సత్కరిస్తున్న నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా నియమితులైన కొలిశెట్టి నాగేశ్వరరావును పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. శనివారం పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడులో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ, పెద్దేవం సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, మండల కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాషం తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. సీనియర్ నాయకుడుగా కొలిశెట్టిని నియమించిన జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణు గోపాల కృష్ణ, నియోజక వర్గ కోర్డినేటర్ తలారి వెంకట్రావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా, పార్ల మెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బట్టు సుబ్బారావు, చేమకూరి సత్యనారాయణ, యండపల్లి సత్యనారాయణ, కొలిశెట్టి రాంబాబు తదితరులున్నారు.

నవధాన్యాల పంటలతో చేలకు మేలు



మల్లేశ్వరంలో ఉత్తమ రైతులను సన్మానిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ రామకృష్ణ

పెరవలి: నవధాన్యాల పంటలను మూడో పంటగా వేస్తే పంట భూములకు మేలు జరగడంతో పాటు రైతులకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని సేంద్రియ వ్యవసాయం జిల్లా కో ఆర్డినేటర్ సాకా రామకృష్ణ తెలిపారు. మల్లేశ్వరం గ్రామంలో వెలుగు సిబ్బంది, రైతులతో శనివారం ర్యాలీ నిర్విహించి, నవధాన్యాల కిట్లను అందించి ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం 45 వేల ఎకరాలకు చేరిందని, ఇది మరింత పెరగాలని, ఈ ఉత్పత్తులపై మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. పంట భూములు సురక్షితంగా ఉండాలంటే ఇప్పటి నుండే సేంద్రియ వ్యవసాయం ప్రతి ఒక్కరూ చేయాలన్నారు. రసాయినిక ఎరువులు వలన పంట భూములు సారం కోల్పోతాయని, సేంద్రియ వ్యవసాయంతో పంట భూములు సారవంతం అవుతాయని వివరించారు. నవధాన్యాల పంటల కోసం 30 రకాల విత్తనాలు సిద్ధం చేశామని, రాబోయే ఖరీఫ్ పంట కోసం ముందస్తుగా ఏఏ పంటలు వేయాలనే దానిపై అవగాహన కల్పించారు. బొలిశెట్టి పట్టాభి, ప్రకృతి వ్యవసాయ మోడల్ మేకర్ ఉమా మహేశ్వరరావు, యూనిట్ ఇన్‌చార్జి సూర్యనారాయణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాముడు, శాంతి పాల్గొన్నారు.

మే డేను జయప్రదం చేయండి

దేవరపల్లి: మే ఒకటో తేదీన జరగనున్న 139వ మే డే(కార్మిక దినోత్సవ) వేడుకలను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. దేవరపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో సీఐటీయూ జెండాను మే డే సందర్భంగా ఆవిష్కరిస్తున్నట్టు ఆయన తెలిపారు. కార్మికులు, కర్షకుల ఐక్యతను చాటేలా మేడే సభలు, సదస్సులు జరపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మే 20న జరగబోయే సార్వత్రిక సమ్మె బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు అయినపర్తి శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకురాలు దుగ్గిన మాణిక్యం, కొత్తగుండ రత్నాజీ, ఉండవల్లి ప్రభావతి, ఉండవల్లి కృష్ణారావు పాల్గొన్నారు.

ఊరెళుతున్నారా.. అయితే జాగ్రత్త!



పట్టణ సీఐ పి.విశ్వం

కొవ్వూరు: వేసవి సెలవుల పేరుతో విహార యాత్రలకు వెళ్లే వారంతా తమ విలువైన బంగారు, వెండి వస్తువులతోపాటు డబ్బులను భద్రపరుచుకుని వెళ్లాలని పట్టణ సీఐ పి.విశ్వం సూచించారు. పట్టణ పోలీసు స్టేషన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వేసవిలో దొంగ తనాలకు అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా చోరీలను అకట్టవచ్చని చెప్పారు. ఆభరణాలను బ్యాంకు లాకర్లలోగానీ, లాకర్ సదుపాయం లేని వాళ్లు తమ బంధువుల వద్ద గానీ దాచుకోవాలని సూచించారు. ప్రయాణంలో తమ వెంట తీసుకెళ్లే బ్యాగ్‌లు, సూట్‌కేసుల్లో వెంట తీసుకెళ్లే విలువైన వస్తువులను భద్రంగా చూసుకోలన్నారు. అపరిచితులు ఇచ్చే తినుబండారాలు గానీ ఏ విధమైన వస్తువులు గానీ తీసుకోకూడదన్నారు. వేసవి ఉక్కపోతను దృష్టిలో ఉంచుకుని ఆరుబయట, డాబాలపై నిద్రించే సమయంలో విలువైన వస్తువులను భద్రపరుచుకోవాలని సూచించారు. దూరపు ప్రయాణాలు వెళ్లే వారు కచ్చితంగా లాక్‌డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. గ్రామాల్లో అనుమానితులు ఎవరైనా సంచరిస్తుంటే 100, 112 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

వ్యక్తికి గాయాలు

చాగల్లు: మీనా నగరంలో మోటారుసైకిల్ ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మీనా నగరం శివారులో నిడదవోలు, పంగిడి రహదారిపై మోటారుసైకిళ్లు ఎదురెదురుగా ఢీకొనడంతో గ్రామానికి చెందిన ఆవల ఏసు తీవ్రంగా గాయపడడంతో అతన్ని అంబులెన్స్‌లో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉపాధి కూలీలకు జీవిత బీమా పథకం



పుల్లలపాడులో ఉపాధి కూలీలకు జీవిత బీమా గురించి వివరిస్తున్న పీడీ నాగమల్లేశ్వరావు

నల్లజర్ల: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్టు పీడీ నాగమల్లేశ్వరావు చెప్పారు. శనివారం ఆయన నల్లజర్ల మండలంలో వివిధ ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. పుల్లలపాడులో వేతనదారులతో మాట్లాడారు. గ్రామీణ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఆదేశాలకు జిల్లాలో పనులకు హాజరయ్యే కూలీలకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు కూలీలతో సంతకాలు చేయించిన దరఖాస్తులు అప్పగిస్తే బ్యాంకు ఖాతాల నుంచి ప్రీమియం మినహాయించకుంటారని చెప్పారు.

ప్రీమియం ఇలా..

కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సురక్ష యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనా కింద భరోసా కల్పించాలని కార్యాచరణ రూపొందించినట్టు చెప్పారు. మొదటి బీమా ప్రీమియం కింద ఏడాదికి రూ.20 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ కూలీ మృతి చెందితే రూ.2లక్షలు చెల్లిస్తారన్నారు. రెండోదానికి సంబంధించి సంవత్సరానికి ప్రీమియం రూ.436 చెల్లించాలన్నారు. సహజ మరణం, ప్రమాదం జరిగితే రూ.2 లక్షలు అందిస్తారన్నారు. ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నాయని, కూలీలలో వయస్సు మళ్లినవారు ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉంటారని వడదెబ్బ, ఇతర కారణాలతో మృతి చెందితే బీమా సౌకర్యం వర్తిస్తుందన్నారు. ఈనెల 28లోగా కూలీలందరూ దరఖాస్తులు అందించాలన్నారు. అచ్చన్నపాలెంలో పశువులకు నీటితొట్టి నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. పుల్లలపాడు పుంత రహదారి పనులను కూడా పరిశీలించారు. ఎంపీడీఓ సింహాద్రి అధ్యక్షతన పనుల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజి నీరింగ్ అసిస్టెంట్లు, టీఏలతో సమీక్ష చేశారు. రోజు 5వేల మంది కూలీలు పనులకు హాజరుకావాల్సి ఉండగా 3,250 మంది మాత్రమే వస్తున్నారని, కూలీలసంఖ్య పెరిగేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింహాద్రి, ఏపీఓ వెంకట్రావు, టీఏ శ్రీనివాస్, సందీప్, రాఘవ ఉన్నారు.